క్లుప్తంగా

నేడు బీజేపీ విస్తృతస్థాయి సమావేశం

కొత్తూరు: పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కొత్తూరు, నందిగామ మండలాల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ అమడపురం నర్సింహ్మగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణతో పాటు పలువురు ముఖ్యులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

కేశంపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరుకానున్న కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్లు రాఘురాంగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని శారద ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మండల అధికారులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, మోర్చాల అధ్యక్షులు, గ్రామాల్లో బూత్ అధ్యక్షులు, సభ్యులు సకాలంలో పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన చింతకుంట రమేష్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డిలు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసుయాదవ్ రూ. 3వేలు, ప్రభాకర్‌రెడ్డి రూ. 3వేలు అందజేశారు. అదేవిధంగా ఇస్రాయిపల్లికి చెందిన కృష్ణయ్యకు ప్రభాకర్‌రెడ్డి రూ. 3వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో అజీజ్, రాజు, వెంకటేశ్, కిరణ్, మహేశ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఖర్జూర పండ్ల పంపిణీ



ముస్లింలకు ఖర్జూర పండ్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కడ్తాల్: రంజాన్ పురస్కరించుకుని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో, ముస్లింలకు ఖర్జూర పంపిణీ చేశారు. ఆదివారం మండల పరిధిలోని చరికొండ, రావిచేడ్, న్యామతాపూర్, సాలార్‌పూర్, ముద్వీన్, ఎక్వాయిపల్లి గ్రామాల్లోని మజీద్‌లలో ముస్లింలకు ఖర్జూర పండ్లను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, లింగం, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్, శ్రీను, చిన్నా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గుడి మెట్ల నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సరిత, మహేందర్‌రెడ్డి దంపతులు

యాచారం: మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ మెట్ల నిర్మాణానికి విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన పొరెడ్డి శారదమ్మ జ్ఞాపకార్థం ఆమె చిన్న కూతురు మొయినాబాద్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సరిత, మహేందర్‌రెడ్డి దంపతులు ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.10,00,116లు విరాళం అందజేశారు. స్వయంభు దేవాలయ అభివృద్ధి కోసం మరింత ఆర్థిక సహాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుర్రం చెన్నకేశవరెడ్డి, వల్లంల బాల్‌రెడ్డి, మేకల యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

యాచారం: ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో పురాతన దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కొత్తపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన దేవాలయాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు కట్టికొమ్ముల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలువ పందిరి.. మొక్కలకు ఊపిరి

నర్సరీల్లో గ్రీన్‌నెట్ షెడ్ల ఏర్పాటు

- మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- హరితహారాన్ని పక్కాగా చేపట్టేందుకు ప్రణాళిక

షాద్‌నగర్: పల్లెల్లో పచ్చదనం వెల్లివిరియాలని.. గ్రామీణ ప్రాంతాల్లోని ఊరూవాడ హరితమయం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. దీనికోసం తగిన నిధులను కేటాయించి పలు గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి హరితహారాన్ని పకడ్బందీగా అమలు చేయాలని యోచిస్తోంది. వేసవి కాలం నేపథ్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొక్కలను సంరక్షించేందుకు గ్రీన్ నెట్ షెడ్లను ఏర్పాటు చేశారు. వాటిని నీటితో తడుపుతూ మొక్కలకు చలువదనాన్ని తీసుకొచ్చి సంరక్షిస్తున్నారు. చలువ పందిళ్ల ద్వారా ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి మొక్కలకు కావాల్సిన సూర్యరశ్మి తగిలి ఏపుగా పెరుగుతున్నాయి.

చలువ పందిళ్లు ఇలా..

షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. కానీ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండిపోకుండా మొక్కలపై చలువ పందిళ్లు వేశారు. మొక్కల చుట్టూ ప్రత్యేకంగా కట్టె స్తంభాలను ఏర్పాటు చేసి వాటిపై నుంచి చలువ పందిరిని వేశారు. ఉదయం 9గంటలలోపే సిబ్బంది మొక్కలకు నీరు పడుతున్నారు.

కూలీలకు ఉపాధి

ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన గ్రామీణ నర్సరీల్లో వందల సంఖ్యలో కూలీలు ఉపాధి పొందుతున్నారు. అయితే కూలీలు నర్సరీల్లో మొక్కలకు నీరు పోయడం, ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేయడంతో ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపాధి కూలీలు ఎండలో కూడా పని చేస్తున్నారు.



చలువ పందిరిలో ఉన్న మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

రైతులకు ప్రోత్సాహం

హరితహారంలో నాటేందుకు కావాల్సిన మొక్కలను పెంచేందుకు ప్రతీ గ్రామంలో ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసింది. నర్సరీల నిర్వాహణకు ఆయా గ్రామాల్లో రైతులను ఎంపిక చేసింది. ప్రతీ రైతుకు ప్రభుత్వం తగిన ప్రోతాహాన్ని అందిస్తోంది. అవసరం అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తూ రైతులను మరింత ప్రోత్సహిస్తోంది. దీంతో నర్సరీల నిర్వాహణకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నర్సరీల నిర్వాహణలో లోపాలు లేకుండా ఉపాధి హామీ అధికారులు ముందుకు సాగుతున్నారు.

“ చర్యలు తీసుకుంటున్నాం



ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నర్సరీల్లో చలువ పందిళ్లు వేశాం. ఎండల నుంచి మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో పెంచే ప్రతి మొక్కనూ కాపాడుతున్నాం.

– అరుణ, ఏపీఓ, ఫరూఖ్‌నగర్

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



దాత సుధీర్‌జైన్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాలు పంచుకొని మానసిక ప్రశాంతత పొందాలని చందిప్ప మరకత శివలింగ ఆలయ కమిటీ చైర్మన్ సదానంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలో ఉన్న బ్రహ్మసూత్ర మరకత శిలింగ ఆలయాన్ని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సుధీర్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శివలింగాన్ని దర్శించుకొని ఆలయ చరిత్రను చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.1,11,111లను చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన ఈ మరకత శివలింగాన్ని దర్శించుకున్న వారి కోరిన కోరికలు తీరుతున్నాయని చెప్పారు. అరుదుగా ఉండే మరకత శివలింగానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. సందర్భంగా దాత సుధీర్‌జైన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్యమే నిజమైన సంపద అని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి ఫరూఖ్‌నగర్‌లోని పురవీధుల గుండా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అందరూ పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని సమయానికి తీసుకోవాలని, నిత్యం శరీరానికి కావాల్సిన నీటిని తాగాలని సూచించారు. అదేవిధంగా ప్రతి రోజు విధిగా వ్యాయామం చేయాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. భోజనంలో మసాలాలు, కారం, పులుపు, వేపుడు పదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలో ఉండే వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని, నిర్లక్ష్యం వ్యవహరిస్తే ప్రాణాలకే ప్రమాదమని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ, రవికుమార్ ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై హెల్ప్ డెస్క్

చేవెళ్ల: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మండుతున్న ఎండల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యల నివారణకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో సీడీఎంఏ, జిల్లా కలెక్టర్‌ల ఆదేశాల మేరకు ఈ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ వేసవిలో నీటి ఎద్దడి నివారణ నిమిత్తం ఏ ప్రాంతంలోనైనా సమస్యలు తలెత్తితే వాటిని సత్వరమే పరిష్కరించటానికి ఈ హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా నీటి సమస్యలు ఏర్పడితే హెల్ప్ డెస్క్ నెంబర్ 9704328088ను సంప్రదించాలని కోరారు. ప్రజలు నీటి వృథాను అరికట్టి, పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఆస్తిపన్నులపై 5 శాతం రాయితీ

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈనెల 30వ తేదీలోపు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఆస్తి పన్నులు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంటనే పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాస్వాములు కావాలని ఆయన సూచించారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

మాడ్గుల: సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని మాడ్గుల మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు చెబుతున్నా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో గ్రామానికి చెందిన ప్రకాశ్‌గౌడ్ సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆదివారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. రహదారి నియమాలను పాటించి వాహనాలను నడపాలని తెలిపారు. బారికేడ్లను ఏర్పాటు చేయడంతో వాహన వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడవచ్చన్నారు. వేగం కన్నా గమ్యం ముఖ్యమని, వాహనదారులు వాహనాలను నిదానంగా నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని, వారికి మనమందరం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుచ్చిలింగంగౌడ్, అంజయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, శంకర్, శివుడు, సురేష్, శ్రీనివాస్, శ్రీశైలం, చంద్రయ్య, కృష్ణ, శ్రీనివాస్, నాగభూషణం, యోగి, మనోహర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

చేసిన పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

కడ్తాల్: జీవితంలో మనం చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేశవరెడ్డి గార్డెన్‌లో, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై, గూడూరు నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గూడూరు రవీందర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సూదిని రాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు గోపాల్, రాములుగౌడ్, లచ్చిరామ్ నాయక్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



గూడూరు నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

నందిగామ: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చేగూరులో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన చేగూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు ఇలాంటి టోర్నమెంటులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని వివరించారు. గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటులో సన్ రైజర్స్ టీమ్ విజేతగా నిలవడంతో ఈ టీమ్‌కు బహుమతులతో పాటు మెమొంటోను అందజేశారు. అదేవిధంగా రన్నర్ జట్టుగా చెన్నై సూపర్ కింగ్స్ నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దారుర్ సతీష్, ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నర్సింహాయాదవ్, మంకాల శ్రీశైలం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



కొహెడలో ప్రచారం నిర్వహిస్తున్న నర్సయ్యగౌడ్

భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

తుర్కయంజాల్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉమర్‌ఖాన్ గూడ, కొహెడ, బ్రాహ్మణపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం కౌన్సిలర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ ఇంటికి వెళ్లి టిఫిన్ చేశారు. సాయంత్రం బ్రాహ్మణపల్లి చౌరస్తా నుంచి తుర్కయంజాల్ వరకు ఆయన ప్రచారం కొనసాగింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నోముల దయానంద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బచ్చిగళ్ల రమేశ్, దాసరి మల్లేశ్, సానెం అంజయ్య, కొత్త రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు!

- ఎండలకు అడుగంటుతున్న భూగర్భజలాలు
- పశువులకు మేతగా మారుతున్న పచ్చని పైర్లు
- ఆందోళనలో అన్నదాతలు



ఎండిపోయిన వరిపంటలో ఆవులను మేపుతున్న రైతు



ముష్టిపల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన వరిపంట

కొందుర్గు: ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో కళ్లముందే ఎండిపోయి పశువులకు మేతగా మారుతున్న దుర్భర పరిస్థితిని అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భజలాలు అడుగంటిపోయి బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోతుండడంతో సాగుచేసిన పంటలు ఎండిపోతున్న దుస్థితిని చూసి అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. చేసేదేమీలేక వేలకువేలు ఖర్చుచేసి సాగుచేసిన పంటలను పశువులకు మేపుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్ ప్రాంతాల్లో ప్రధానంగా యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలను సాగుచేస్తారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో వరిపంటను అధికంగా సాగుచేస్తారు. ఈ లెక్కన షాద్‌నగర్ నియోజకవర్గంలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో ఫరూఖ్‌నగర్ 9500 ఎకరాలు, జిల్లేడ్ చౌదరిగూడ 4007 ఎకరాలు, కేశంపేట 4690 ఎకరాలు, కొందుర్గు 2778 ఎకరాలు, కొత్తూర్ 993 ఎకరాలు, నందిగామ 308 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారు. అయితే వరిసాగు ప్రధానంగా బోరుబావుల ఆధారంగానే అధికంగా వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత కారణంగా బోరుబావుల్లో నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. దీంతో దాదాపు ఇప్పటికే పదిశాతం పంటలు ఎండిపోయాయి. వేలకు వేలు ఖర్చుచేసి సాగుచేసిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతన్నలు వాపోతున్నారు.

రంగారెడ్డి జిల్లాలోని వివిధ డివిజన్లలో వరి సాగు వివరాలు..

ఆమనగల్లు	25058 ఎకరాలు
చేవెళ్ల	10067 ఎకరాలు
ఇబ్రహీంపట్నం	18410 ఎకరాలు
మహేశ్వరం	10647 ఎకరాలు
రాజేంద్రనగర్	2526 ఎకరాలు
షాద్‌నగర్	24976 ఎకరాలు

“ పశువులను మేపుతున్నాను



నేను ఆరునెలల క్రితం లక్ష రూపాయలు ఖర్చుచేసి బోరు వేశాను. నీళ్లు పుష్కలంగా వచ్చాయి. దీంతో 1.5 ఎకరాల విస్తీర్ణంలో వరిపంటను సాగుచేశాను. అకస్మాత్తుగా నీళ్లు తగ్గిపోయాయి. మరో రెండు బోర్లు వేసినా నీళ్లు రాలేదు. ప్రస్తుతం పంటంతా ఎండిపోతోంది. చేసేదేమీలేక పశువులను మేపుతున్నాను.

–ముర్షత్, రైతు, ముష్టిపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

మా దృష్టికి రాలేదు..



పంటలు ఎండిపోతున్నట్లు ఇంతవరకు మా దృష్టికి రాలేదు. అన్ని మండలాల ఏఓలకు సూచించి ఎండిపోయిన పంటల వివరాలను సేకరిస్తాం. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

–రాజారత్నం, ఏడీఏ, షాద్‌నగర్